



# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 02 సెప్టెంబర్ 2024


## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం దొరకని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి రాగలరు

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 2న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అక్కడ పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

- విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలి - రాష్ట్ర రవాణా, యువజనక్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి







**రాయచోటి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు 2వ సౌత్ జోన్ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 మెన్ అండ్ ఉమెన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా దాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని ఈ పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల లో గెలుపు ఓటమి సమానమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో క్రీడాకారులు ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్య, ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాయచోటి పట్టణంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న టార్గెట్ బాల్ క్రీడా పోటీలలో తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రివర్యుల ను వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరు రాష్ట్రాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం తమ క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి తెలియజేయడం జరిగింది. ఆదివారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న మంత్రివర్యులకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న మంత్రివర్యులకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై గజమాలలతో సన్మానించారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితుల కు న్యాయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అధికారులందరూ బాధితుల సమస్యలను పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు.

## అమ్మవారికి కిలో వెండి వితరణ



**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:** అనంతరం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి లక్కిరెడ్డిపల్లె మండలం అప్పగుండయ్య గారి పల్లెకి చెందిన రామచంద్రయ్య కుటుంబ సభ్యులు అమ్మ వారికి ఆదివారం కిలో వెండి వస్తువులు వితరణ అందజేశారు ఈ సందర్భం గా ఆలయ కార్య నిర్వహ ణ అధికారి మారుతి ప్రసాద్, ఆలయ సిబ్బందికి వెండి హారతి పళ్లెం కుంకుమ్మ భరణి అందజే శారు. శ్రావనమాసం లాస్ట్ వారం కావడంతో భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవా రికి మొక్కులు తీర్చుకున్నారు ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతి ప్రసాద్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు ఆదిమూలం రామచంద్ర చెల్లు వంశీయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గోబ్యాక్

అంగళ్ళు బస్టాండులో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం : అంగళ్ళులో ఉద్రిక్తత ..పోలీసులు మొహరింపు





**కురబలకోట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** తంబళ్ళపల్లె వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గోబ్యాక్ అంటూ నియోజకవర్గ టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున ఆదివారం అంగళ్ళు బస్టాండులో నినాదాలుచేశారు. సిఎం చంద్రబాబుకు, మంత్రి నారాలోకేష్‌కు భేషరతుగా క్షమాపణలు చెప్పి ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటించాలని తంబళ్ళపల్లె టిడిపి నాయకులు దాసరపల్లె జయచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సీడ్ మల్లికార్జుననాయుడులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన తంబళ్ళపల్లెలోని స్వగృహంలో ఉన్న ఎమ్మెల్యే ఆదివారం పిటిఎం మండలంలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఎంపిలు విచ్చేస్తారని టిడిపి శ్రేణులకు సమాచారం అందడంతో పెద్దఎత్తున నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు అందరూ అంగళ్ళుకు చేరుకొన్నారు. దీంతో అంగళ్ళు బస్టాండులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు బందోబస్తు ఉన్నప్పటికి టిడిపి శ్రేణులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దగ్ధం చేసి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు జయచంద్రారెడ్డి, మల్లికార్జుననాయుడులు మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకదందా, భూ దందాలకు పాల్పడడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ అరాచకాలు సృష్టించారని ఆరోపించారు. తమ నాయకుడు చంద్రబాబుపై అంగళ్ళులో రాళ్ళు విసిరిన ఘటన, నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణలు చెప్పేంతవరకు నియోజకవర్గంలో పర్యటిస్తే అడ్డుకొంటామని హెచ్చరించారు. ఉదయం 7గంటల నుంచి మద్యాహ్నం 2గంటల వరకు టిడిపి శ్రేణులు భీష్టించి వేచిఉన్నారు. అనంతరం మదనపల్లె డిఎస్‌పి తంబళ్లపల్లెకు విచ్చేసి ఎమ్మెల్యేను హౌస్‌అరెస్టు చేయడంతో కార్యకర్తలు అక్కడ నుంచి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్రయాదవ్, వైజి సురేంద్ర, జంగా రాఘవరెడ్డి, అయూబ్, గుత్తికొండ త్యాగరాజు, పూస మోహన్‌రెడ్డి, రుద్రా బాలక్రిష్ణ, మేజారి సదాశివ, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసంపై కఠిన చర్యలు

నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



**పీలేరు, సెప్టెంబరు 01 ప్రభాతవార్తః** మాజీ ముఖ్య మంత్రి దివంగత వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసంపై సోషల్ మీడియాలో వచ్చిన వార్తలకు స్పందించిన తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి స్పందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను నియోజకవర్గ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించా రు. పట్టణ శివారులోని ఏపీఐఐసీ లేఅవుట్ పరిధిలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నల్లారి కుటుంబం 1962 నుంచి రాజకీయాల్లో పోటీచేస్తూ 15 సార్లు పోటీచేసి 9సార్లు గెలుపొందా మని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఏపార్టీ వాళ్లైనా సరే తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన తీవ్రంగా ఖండించారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చేది మనమే

- హామీలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాం - మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





**పులివెందుల, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ః** ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రభుత్వం మనదే అని, ప్రజలకు అర్థమైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టలేదని, మంచి రోజులు వస్తాయని, ఎవరు భయపడకూడదని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండోరోజు ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉందని, మన పట్ల ప్రజలకు విశ్వాసం ఉందని, మళ్లీ ప్రజల్లోకి వస్తానని, భవిష్యత్తు మనదే అని వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు మాజీ నేతలతో కూడా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసాఇచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని, శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కొంతమంది కార్యకర్తలు, అభిమానులు వారి ఆరోగ్య, నిరుద్యోగ సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ వారి యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీ అవినాష్‌రెడ్డికి సూచించారు. అలాగే పట్టణంలోని క్రీడాకారులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో బాగా రాణించి పులివెందులకు, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, మీకు ఎప్పుడూ అండగా ఉంటామని వారికి హామీఇచ్చారు.

- ఆప్యాయంగా పలకరింపు ః జగన్‌ను కలిసేందుకు జిల్లాలోని నలుమూలల నుండి భారీగా జనం తరలివచ్చారు. వారందరినీ మాజీ సీఎం జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతులను స్వీకరించారు. పులివెందులకు భారీగా తరలివచ్చిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులను ఓపికతో పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. మీరు ఎవరూ కూడా ఢీలా పడకుండా ధైర్యంగా ముందుకు వెళ్లాలని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది.

- జిల్లా రాజకీయాలపై ఆరా ః వైఎస్ఆర్‌సీపీ ముఖ్య నాయకులతో జిల్లా రాజకీయాలపై మాజీ సీఎం జగన్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి చేజార్చుకోకుండా ఉండేందుకు ముఖ్య నేతలకు దిశ, దశ నిర్దేశించినట్లు సమాచారం. ఎవరైనా జడ్పీటీసీలు అసంతృప్తిగా ఉంటే తమ దగ్గరకు తీసుకురావాలని, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక జరిగేంత వరకు జడ్పీటీసీలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎవరూ చేజారడకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా నాయకులపై ఉందన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని నాయకులతో చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్ మనోహర్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.


## రూ.2.5కోట్లకు మొబైల్స్ స్పేర్‌పార్ట్స్ వ్యాపారి ఐపి

వార్త 4లో...

## డిప్యూటి సీఎం ఆదేశాలతో అభయారణ్యంలో డిఎఫ్ఓ విచారణ



**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:** రాజంపేట మండలం ఆర్. బుదుగుంటపల్లి ఇసుక క్వారీకి సంబంధించి అక్రమంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో గత జగన్ సర్కార్ హయాంలో జరిగిన అక్రమాలపై డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ శివకుమార్ ఆదివారం విచారణకు వచ్చారు. డిప్యూటి సీఎం, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి వర్యులు పవణ్‌కళ్యాణ్ ఆదేశాలతో అన్నమయ్య జిల్లా డిఎఫ్ఓ వివేక్‌పై స్పెషల్ స్క్వాడ్ డిఎఫ్ఓ శివకుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. రాజంపేట-రాయచోటి రోడ్డులోని సానిపాయ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో బాలరాచపల్లి బ్రిడ్జి పక్కనే ఇసుక క్వారీకి వెళ్లేందుకు గతంలో వైసీపీ నేతలు అక్రమంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో కొండను తవ్వి అడవిని నాశనం చేశారని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అతికారి దినేష్ ఇటివల రాజంపేటకు వచ్చిన డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విశయం రాజంపేట డీఎఫ్ఓ వివేక్ దృష్టికి తీసుకువెల్లి దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటి సీఎం శాఖా పరంగా నివేదిక కోరారు. ఈ మేరకు డీఎఫ్ఓ విచారణకు వచ్చారు. ఈ సంధర్భంగా జనసేన నేత దినేష్ మాట్లాడుతూ గత వైపీపీ పాలనలో ఇక్కడ ఇసుక రీచ్ పేరుతో ఇసుక తరలించడానికి చెప్పి కొండలను తవ్వేసి ప్రకృతిని నాశనం చేశారన్నారు. అధికారుల దృష్టికి కూడ ఈ సమస్యను తీసుకుపోయినప్పటికి చర్యలు లేకపోవడంతో ఈ ప్రాంతం అటవీశాఖ సంబంధం వుండవచ్చునని పచ్చదనంతో ముసుగు వేసుకొని ఉన్న కొండలను ఎటువంటి అనుమతి లేకుండా యంత్రాలతో తవ్వేసి ఇసుక కోసం నదిలో రహదారి వేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని అతికారి దినేష్ అన్నమయ్య డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్ దృష్టికి ఈ సమస్యను అర్జి రూపంలో తీసుకుపోయామన్నారు. డిస్ట్రిక్ ఫారెస్ట్ అధికారి ప్రవర్తనను, అప్పుడు అటవి శాఖలో జరిగిన దోపిడి గురించి డిప్యూటి సీకం దృష్టికి తీసుకుపోయామన్నారు. ఈ విశయంలో స్పందించిన డీఎఫ్ఓ వివేక్‌పై అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ విచారణ చేపట్టమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు స్పెషల్ స్క్వాడ్ డిఎఫ్ఓ శివకుమార్ ఆధ్వర్యంలో యంత్రాలతో తవ్విన పాలికొండ సంఘటన స్థలంలో విచారణ చేపట్టారని చెప్పారు. సొంత లాభం కోసం పెద్దల అండదండలు చూసుకొని డీఎఫ్ఓ వివేక్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.




## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన బైక్ : ఇద్దరు మృతి



**ఖాజీపేట, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాటిమీద పల్లె టోల్ ప్లాజా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న లారీని ఢీ కొనంన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన ఖాజీపేట మండలం కడప-కర్నూల్ జాతీయ రహదారి పాటిమీద పల్లె టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు...ద్విచక్ర వాహణాన్ని కొనుగోలు చేసి ప్రొద్దుటూరు నుండి కడపకు వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. మృతులు చింతకొమ్మదిన్నె మండలం పాత సాహెబ్‌పేటకు చెందిన వెంకటరమణా, దినేష్ రెడ్డిగా మృతులు గుర్తింపు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తనలా ఉన్నవారికి ఉపాధి ఇస్తూ..

**ఒక్క అవకాశమివ్వండి. నా శరీరానికే సమస్య. నా మెదడుకు కాదు.. ఇంటర్వ్యూకు వెళ్లిన ప్రతిసారి అక్కడివారికి దిశా పాండ్యా చెప్పే మాటే ఇది! అయినా 17 తిరస్కరణలు తప్పలేదు. అలాంటి తను ప్రముఖ సంస్థల్లో పనిచేసింది. అథ్లెట్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తనలా సమస్య ఉన్నవారికి ఉపాధి అవకాశాలూ చూపిస్తోంది. ఇంతకీ ఎవరీమె? ఏమిటామె సమస్య !**



నాన్న సలహా మేరకు డిజేబిలిటీ సర్టిఫికెట్ తెచ్చుకుందామని గవర్నమెంట్ ఆఫీసుకి వెళ్లింది దిశ. ఒక కళ్లు లేని అమాయిని సాయమడిగితే తన దఖాస్తునీ పూర్తిచేసింది. అప్పుడా అమ్మాయి 'మీ సమస్యేంటి' అనడిగితే నేను 'మరుగుజ్జు' అని సమాధాన మిచ్చింది దిశ. అర్థం కాలేదా అమ్మాయి దీంతో 'నా కాళ్లూ చేతులూ మిగతావారి కంటే చిన్నగా ఉంటాయని చెప్పింది దిశ. దానికామె అవయవాలన్నీ బాగానే పనిచేస్తున్నాయి కదా! అలాంటప్పుడు నీకు నువ్వు లోపమున్న వ్యక్తిగా ఎందుకు చెప్పుకొంటున్నావ్ అనడిగిందట. ఆలోచనలో పడిన దిశ సర్టిఫికెట్ తీసుకోకుండానే వెనుదిరిగింది. దిశ ఎత్తు 4.2అడుగులే. ఈమెది ముంబయి. జన్యులోపం కారణంగా అలా పుట్టింది. ఆటలన్నా, డాన్స్ అన్నా ప్రాణం. కానీ స్కూల్లో తోటివిద్యార్థులు చేర్చుకునేవారు కాదు. పెద్దయ్యేకొద్దీ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఏం చేసినా ఏడిపించేవారు. బయటికి వెళ్లాలంటేనే భయపడేది.

ఈ క్రమంలో కాలేజీలో ఫెయిల్ అయ్యింది.

**ఆటల్లోనూ అడుగుపెట్టి ....** ఆమె అమ్మానాన్నలదీ ఇదే సమస్య. అయినా కూతురిని అన్నింటా ప్రోత్సహించే వారు. అలాంటిది ఆమె ఫెయిల్ అయ్యేసరికి తండ్రి దిగులుపడ్డాడు. ఆయన్నలా చూడలేకపోయింది దిశ. అందుకే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రాఫిక్ డిజైనింగ్ చేసింది. ఆపై డిగ్రీ పూర్తయ్యింది. రెండు డిగ్రీలతో మంచి ఉద్యోగం ఖాయం. నాన్న ముందు గర్వంగా నిలబడొచ్చు అనుకుంటే.. అర్హతలన్నీ సరే కానీ.. మీరు ఉంటే ఇతరులు ఇబ్బందిగా ఫీలవుతారు అని తిరస్కరించేవారు. అర్హత ఉన్నా రూపం కారణంగా తిరస్కరించడంతో కుంగిపోయింది. దీంతో ఆమె తండ్రి మనకీ డిజేబిలిటీ సర్టిఫికెట్ ఇస్తారు. దాంతో అయినా ప్రభుత్వోద్యోగం పొందొచ్చు. ప్రయత్నించు అన్నారట. కానీ ఆ కళ్లు లేని అమ్మాయి మాటతో దాన్ని వదిలి సొంతంగా ఉద్యోగం ప్రయత్నించింది దిశ. హెచ్‌డిఎఫ్‌సీ, బిస్లరీ వంటి ఎన్నో సంస్థల్లో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేసింది. ప్రస్తుతం రిచ్స్ ఇండియా క్రియేటివ్ హెడ్. అనుకోకుండా రైల్లో పరిచయమైన మరో వ్యక్తి స్ఫూర్తితో త్రో బాల్‌లో రాణించింది. నేషనల్ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్, మారథాన్లలోనూ పాల్గొంటోంది.

**వారికి సాయపడాలనే...** తనలా ఎంతోమంది ఇబ్బంది పడటం గమనించింది దిశ. వాళ్లకి సాయపడాలని 2018లో లిటిల్ పీపుల్ ఇండియా (ఎల్‌పిఐ) ప్రారంభించింది. దీనిద్వారా మరుగుజ్జులకు ఉద్యోగాలు, క్రీడల్లో అవకాశాలను చూపిస్తోంది. దీనికోసం కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలనూ చేసుకుంది. సినిమాలు, సర్కస్‌లు.. కారణమేదైతేనేం పొట్టిగా కనిపిస్తే నవ్వేవారే ఎక్కువ. కానీ ఆ ప్రభావం వారిపై చాలా ఉంటుందన్నది మర్చిపోతున్నారు. కాబట్టే, చాలా మంది తమ రూపాన్ని చూసుకుని బాధపడు తుంటారు. వాళ్లలో ఆత్మవిశ్వాసం నింపాలని ఎల్‌పిఐ ప్రారంభించా. ఏడుగురితో మొదలైన సంస్థలో ప్రస్తుతం 650 మంది సభ్యులున్నారు. ఉపాధి, క్రీడలు..నచ్చిన అంశాల్లో దేశవ్యాప్తంగా ఉన్న నాలాంటివారికి సాయమందిస్తున్నా. దీనికోసం ఎన్‌జీఓలతోనూ కలిసి పనిచేస్తున్నా. పొట్టి అనేకాదు, ఇంకా ఎన్నో రకాలుగా ఏడిపించడం సహజమే దాన్ని మనం పట్టించుకున్నప్పుడే ఓడిపోతాం. అలాకాకుండా వాటన్నింటినీ పక్కకునెట్టి, చుట్టూ ఉన్న అవకాశాలను అందుకుంటూ ముందుకు సాగండి. విజేతలుగా నిలుస్తా' అంటోన్న 39 ఏళ్ల దిశ టెడెక్స్ స్పీకర్ కూడా.



ఈ విశ్వానికి ఆద్యుడు శ్రీకృష్ణుడు సర్వం తెలిసిన వ్యక్తి. తాత్విక వేత్త ఎప్పుడు ఎలా మసలుకోవాలో, ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో బాగా తెలిసిన నేర్పరి మంచి రాజనీతివేత్త కురు, పాండవుల మధ్య సమరం జరుగరాదని, జరిగితే వచ్చే నష్టాన్ని కళ్ళకు కట్టనట్లుగా సయోధనునికి తెలిపిన జ్ఞాని. పాండవులకు ముఖ్య సలహాదారుడిగా అన్నిటా తానై ఉండి సంరక్షించిన మహా మనిషి. ద్రౌపది వస్త్రపహరణం జరిగిన వేళ చీరెలు ఇచ్చి చెల్లెలికి రక్షణగా నిలబడిన వ్యక్తి. మాయ జూదంలో పాండవులు ఓడి పోతారని, అది వారికే లాభా దాయకమని ముందే పసిగట్టిన భవిష్యత్ విధాత శ్రీకృష్ణుడు. అర్జునునికి రథ సారధిగా ఉండి యుద్ధ మెలకువలు తెలిసిన వ్యక్తి. సూర్యాస్తమయంలోగా సైందవుడిని సంహారిస్తానని చెప్పినప్పుడు, కాలాన్ని మార్చి వేసిన లోక దారి. అర్జునుని ప్రతిజ్ఞ సఫలం కావడానికి శ్రీకృష్ణుని లీలనే ప్రధానం అలానే శిశు పాలుని నూరు తప్పులు క్షమిస్తానని అత్తకు మాట ఇచ్చి నూటొక్క తప్పులు చేయబోతున్నప్పుడు మాట ప్రకారం సుదర్శన చక్రంతో శిశుపాలుని శిరము ఖండించి వేసే మాట జవదాటని వీరుడు. వాస్తవాలు గమనించి పాండవుల పక్షాన చేరమని జన్మ రహస్య కర్ణుడికి చెప్పిన తత్వవేత్త. శకుని మాయో పాయములు తెలిసిన సూత్రదారి. కౌరవుల పంచనే ఉండి,



# మహా దౌత్యవేత్త శ్రీకృష్ణుడు


వారిని పాండవుల పైకి రెచ్చగొట్టి, సుయోధనుని పతనం, శకుని కుయుక్తులు తెలిసిన సర్వగ్నుడు కృష్ణుడు. అష్ట మహిషులను ఒకటిగా చూసిన రసగ్నుడు. సత్యభామ కోపాన్ని శాంతింప జేసిన శాంతిదాత. రుక్మిణిని ఆసాంతం తన హృదయంలో నిలుపుకున్న హృదయాలోలుడు. గోపికలచే నృత్యాలు చేస్తు ఆడుతూ, పాడుతూ వారి మనసును గెలిచిన ప్రేమ మూర్తి చిన్న తనంలోను, పెద్ద తనంలోను వెన్న అంటే మహాఇష్టముగా జుర్రుకున్న వెన్న దొంగ విధురుని భక్తిని స్వయంగా చూసిన భక్తి పరుడు. విశ్వరూపాన్ని చూపి తన ధర్మాన్ని నిర్వర్తించమని పార్థునికి భగవద్గిత బోధించిన శ్రీకృష్ణుడు నాటికీ, నేటికీ మనకు ఆద్యుడు పూజ్యుడు మహా పురుషుడు. నన్నే పూజిస్తూ నాకు తృణమో, ప్రణమో అర్పించిన వారిని నేను ఈతి బాధల నుండి తీరం చేరుస్తానని సత్యం చెప్పిన సర్వగ్నుడు మన శ్రీకృష్ణుడు. ఇన్ని మంచి కార్యములు చేసిన కపట నాటక సూత్రధారి అని పేరు పడినా, మంచి చేయి వారికి సహాయంగాను, చెడు చేసిన వారిని శిక్షించిన వ్యక్తిగా లోక ప్రసిద్ధుడుగా, కోరిన వారికి వరాలు నొసంగే. దయమూర్తి శ్రీకృష్ణుడు బలరామునికి చేదోడుగా ఉండి ఆదర్శ సోదరునిగా మెలగిన శ్రీకృష్ణుడు సర్వదా మనకు ఆరాధనీయుడు.

**- కనుమ ఎల్లారెడ్డి**


# పాలకూరతో మేలు

ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చూపును మెరుగుపరుస్తుంది. ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఊబకాయం రాదు. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. పాలకూర తరచూ తినేవారిలో మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుంది. శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలుగుతుంది. పాలకూరలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉన్నందున చర్మం కాంతిమంతంగా ఉంటుంది. ఇది క్యాన్సర్లను సైతం నిరోధిస్తుంది. పాలకూరతో ఇన్ని లాభాలున్న మాట నిజమే కానీ మూత్రపిండాల్లో రాళ్ళు, బ్లడ్ క్లాట్స్ లాంటి సమస్యలు ఉన్నవారికి మాత్రం ఇది మేలు కంటే కీడేచేస్తుంది. వాళ్ల దీన్ని వీలైనంత తక్కువ తినడమే మంచిది.

# నల్లనయ్యకు నైవేద్యం



## తియ్యటి అటుకులు



**కావలిసినవి :** అటుకులు– రెండు కప్పులు, కొబ్బరిపాలు– రెండు కప్పులు, పంచదార– కప్పు, ఆకుపచ్చ ఫుడ్ కలర్–కొద్దిగా.

**తయారీ :** ముందుగా కొబ్బరిని గ్రైండ్ చేసి, అందులోంచి కొబ్బరి పాలు తీయాలి. సన్న సెగ మీద ఈ పాలు మరిగిస్తూ అందులో పంచదార వేయాలి. అది కరిగాక అటుకులు, ఫుడ్ కలర్ వేసి కలియతిప్పి కొద్దిగా ఉడికించి దించేయాలి. ఈ తియ్యటి అటుకుల పైన కాస్త కొబ్బరి కోరుచల్లితే.. రుచి పెరగడమే కాకుండా, మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

## మోదకం



**కావలసినవి :** అటుకులు– రెండు కప్పులు, నెయ్యి– కప్పు, బెల్లం– పావు, యాలకుల పొడి–అర చెంచా, జీడిపప్పు, కిస్మిస్–అర కప్పు, నచ్చిన ఫుడ్ కలర్ –కొద్దిగా

**తయారీ :** కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అటుకులు వేయించుకోవాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. జీడిపప్పు, కిస్మిలో నేతిలో వేయించాలి. బెల్లం పాకం పట్టి–అందులో అటుకులు పొడి, యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్, ఫుడ్ కలర్ వేసికలపాలి. ఆ మిశ్రమంతో మోదకాలు చుట్టుకోవాలి. ఇవి రుచీ, ఆరోగ్యం కూడా.

## కేసరి..

**కావలసినవి :** అటుకులు, చక్కెర–కప్పు చొప్పున, నెయ్యి–అర కప్పు, యాలకుల పొడి–అర చెంచా, జీడిపప్పు, కిస్మస్–అర కప్పు, కుంకుమ పువ్వు.

**తయారీ :** ముందుగా కడాయిలో నెయ్యి వేసి అటుకులు వేయించాలి. వేడి తగ్గాక కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. ఇందులో నెయ్యి, కొద్దిగా నీళ్లు పోసి ఉండలు రాకుండా ఉడికించాలి. పంచదార వేస్తూ కలియ బెట్టాలి. దగ్గరగా అయ్యాక.. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్, కుంకుమ పువ్వు వేసి కలపాలి. అంతే.. కేసరి సిద్ధం.



వేడి పాత్రలను దించేందుకు పట్‌కార్ ఉపయోగించడం మనకేం కొత్త కాదు. అయితే వాటిని ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్టు అధునాతనంగా రూపొందిస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా అంచు లేని స్టీల్ పాత్రలు, అవెన్‌లో వేడి చేసేందుకు పింగాణీ పాత్రలు వాడుతున్నాం. పాత రకం పట్‌కార్ వీటికి అనుకూలం కాదు. ఎలాంటి పాత్రలనైనా

# చేతులు కాలవు, పాత్రలు బెసకవు !

బెసికిపోకుండా, గట్టిగా పట్టుకునేలా డిష్ గ్రిప్పర్లు, పాట్ హోల్డర్లు వచ్చాయి. వీటితో పాత్రలే కాదు, పింగాణీ ప్లేట్లు కూడా అటూ ఇటూ మార్చడం సులువుగా ఉంటుంది. రెండున్నర కిలోల బరువు వరకూ ఒక చేత్తో పట్టుకునే బౌల్ పికర్, డిష్ హోల్డర్, అంతకంటే బరువుంటే చిన్న క్లిప్పులాగ ఉండే రెండు గ్రిప్పర్లు: అవెన్ లేదా ఎలక్ట్రిక్ కుక్కర్ లోంచి తీయడానికి వేడి తట్టుకునే గ్లోవ్స్: ప్లేట్లు, పింగాణీ పాత్రలను పట్టుకునేందుకు కింది నుంచి స్టాండ్‌లా ఉండి తేలిగానగ పట్టుకునే బౌల్ క్యారియర్.. ఇలా అన్నీ కలిపి సెట్‌లా లభిస్తున్నాయి. వీటితో చేతులకు వేడి సెగ తగలదు, పాత్రలు బెసకవు.

## చెలి చిట్కా

ఇంట్లో ఈగలు రాకుండా వుండాలంటే ఇల్లు కడిగేటప్పుడు గచ్చుమీద కొంచెం పసుపుచల్లి కడిగితే ఈగలు రాకుండా ఉంలాయి.

# సోషల్ మీడియాతో ఆదాయం

సోషల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాదు.. సంపాదన మార్గం కూడా! అందుకే చాలామంది అమ్మాయిలు ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారుతున్నారు. వ్యాపకంగా ప్రయత్నిసేనపర్లేదు కానీ.. ఆరోగ్యాన్నే పణంగా పెట్టట్లేదు కదా? మెలకువ రావడం ఆలస్యం.. చేయి ఫోన్ వైపు వెళ్తోందా? సమయం చూడటానికో, అలారం ఆపేయడానికో అయితే పర్లేదు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు ఎన్ని లైకులొచ్చాయి. ఎంతమంది చూశారంటూ కంగారుగా వెతికేస్తున్నారా? స్నేహితులదో, బంధువులదో ఒక ఫొటో లేదా వీడియో కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. వాళ్ల ఆనందం మరింత బాధ పెంచేస్తున్నా.. నాకన్నా వాళ్లకే ఎందుకు గుర్తింపు వస్తోందంటూ అసహనం పెరిగిపోతోన్నా.. ఫోన్, ఇంటర్‌నెట్‌లు మీపై పెత్తనం చెలాయిస్తున్నాయనే అర్థం. ఎంత సమయం ? ... సోషల్ మీడియా ఒక తరహా వినోదమే. అది అంతవరకే పరిమితమవ్వాలి. ఇంతకీ రోజులో దానికి ఎంతసేపు కేటాయిస్తున్నారు? గంట, రెండు గంటలు? అంతకు మించుతున్నా.. దానిలో వచ్చే కామెంట్లూ, లైకులూ మీ భావోద్వేగాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నా.. మీరు సమస్యల్లో ఉన్నట్లే. ఎంటర్‌టైన్‌మెంట్ పరిధి దాటి జీవితంలో ఎక్కువ భాగం ఆక్రమిస్తోందంటే ఫోన్‌కి విరామం ప్రకటించాలనే

# పిల్లలకు నెబ్యులైజర్ ..

**సాధారణంగా చిన్న వయసులో పిల్లలు ఆడుకోవడానికి** వివిధ రకాల ఆట వస్తువులను తాకుతుంటారు. వీటి నుంచి సోకే క్రిముల కారణంగా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే వాతావరణంలో వచ్చే మార్పులు, కొత్తగా ఏదైనా ఆహార పదార్థాన్ని అలవాటు చేసినప్పుడు కూడా జలుబు చేయడం సహజం. జలుబు ఉన్నా కానీ



సాధారణంగా ఆడుకుంటారు. ఎదుగుదలలో ఎలాంటి సమస్యా లేదు అంటే అది అలర్జీ వల్ల వచ్చిన జలుబుగా భావించాలి. ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల జలుబు వచ్చినప్పుడు జ్వరం రావడం, సరిగా నిద్రపోకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదటి రకం జలుబుకి అలర్జీకి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది. ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల జలుబు వచ్చినప్పుడు ఊపిరితిత్తులో తెమడ చేరుతుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడానికి పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. దానివల్ల వాంతులు చేసుకోవడం, నిద్రపట్టకపోవడం, ఆయాసపడడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే ఎక్కువసేపు ఏడుస్తుంటారు కూడా .ఇలాంటప్పుడు ఈ రకం నెబ్యులైజర్ వాడాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ముక్కు దిబ్బడ తగ్గుతుందని జలుబు నుంచి వేగంగా ఉపశమనం పొందచ్చని సొంతంగానే నెబ్యులైజర్ వాడుతుంటారు. కానీ అది సరికాదు. డాక్టర్ సలహా మేరకు మాత్రమే నెబ్యులైజర్‌ని ఉపయోగించాలి. ఒకవేళ బాబుకి తరచుగా అలర్జీ సమస్య ఉంటే అత్యవసర సమయంలో నెబ్యులైజర్ వాడచ్చు. అయితే ప్రతిసారీ జలుబుకి నెబ్యులైజర్ ప్రత్యామ్నాయ చికిత్స కాదన్న విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి.

# ఉల్లాసంగా, ఉత్సాహంగా..

**నేటి తరం మహిళలకు ఆరోగ్య స్పృహ ఎక్కువే.** నిత్యం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి చేసే ప్రయత్నాలూ అనేకం. మరి అలా ఉండాలంటే డైట్ పరంగా ఏం చేయాలో తెలుసా. మనం తినే ఆహారమే మనల్ని నిర్ణయిస్తుందంటారు. అది అక్షర సత్యం. మనం ఎంత ఆహారం తీసుకుంటున్నామనే దానిమీద అంటే అందులోని కెలోరీల పరిమాణంపై మనం జీవన కాలం ఆధారపడి ఉంటుందట. తక్కువ కెలోరీలు తీసుకునే వారిలో బ్రెయిన్ ఏజింగ్ ఆలస్యమవటమే కాకుండా వయసు పెరిగేకొద్దీ వచ్చే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటివీ తొందరగా రాకుండా ఉంటాయి. దాంతో పాటు ఆరోగ్యం మెరుగుపడి ఆయుష్షూ పెరుగుతుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే నీళ్లు ఎక్కువగా తాగటం, పంచదారతో తయారు చేసిన పదార్థాలకు దూరంగా ఉండటం, తక్కువ కార్బోహైడ్రేట్లూ ఎక్కువ ప్రొటీన్లూ ఉండే ఆహారాన్ని తీసుకోవటంతో పాటు నిత్యం వ్యాయామం చేయటం ద్వారా కెలోరీలనూ తగ్గించుకుంటే ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండొచ్చు



## నేడు మాజీ సీఎం వైఎస్ .రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని జరుపుకుందాం

కేవి.పల్లె, సెప్టెంబరు 01 ప్రభాతవార్తః



మండలంలోని గర్నిమిట్ట బస్టాండు నందు మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని జరుపుకునే బాధ్యత మనందరిపై ఉందని స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు గజ్జల శ్రుతిరెడ్డి అన్నారు. అనంతరం మండల యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్రధాత అని ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కావున వైఎస్సార్ సీపీ లీడర్లు, నాయకులు కార్యకర్తలు తప్పక ఈకార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం



మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :

ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనకు సంబందించి ముదివేడు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. కురబలకోట మండలం, అంగళ్ళు గ్రామం, పత్తివారిపల్లెకు చెందిన పత్తి వేణుగోపాల్(45) స్థానిక టమోటా మండీలో కూలిపనిచేస్తాడు. ఇంటిలో భార్య ముగ్గురుపిల్లలను పోషించడం కష్టంగా మారి, ఆర్థిక ఇబ్బందులను తుట్టకోలేక తన వ్యవసాయపొలం వద్దకు వెళ్ళి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి బాధితున్ని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించడంతోన కోలుకొంటున్నాడు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టెంపో ఢీ కొని స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :




టెంపో బైక్‌ను ఢీ కొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆపస్మారక స్థితికి చేరుకొన్నాడు. ములకలచెరువు పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. బి.కొత్తకోట మండలం, గొళ్ళపల్లెకు చెందిన శశికుమార్(26) సొంత పనిమీద బైకులో ములకలచెరువుకు వెలుతుండగా, మార్గ మద్యంలోని వేపూరికోట వద్ద ఎదురుగా వస్తున్న టెంపు స్కూటర్‌ను ఢీ కొంది.ప్రమాదంలో గాయపడిన బాధితున్ని స్థానికులు గమనించి చికిత్సకోసం 108లో వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హాస్టల్‌లో అసాంఘీక కార్యకలాపాలకు నో ఛాన్స్ : సిఐ

కురబలకోట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :




హాస్టల్‌లో అసాంఘీక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె రూరల్ సిఐ రమేష్ హెచ్చరించారు. ఆదివారం ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన ప్రైవేటు హాస్టళ్ళు, పీజిలు నిర్వాహకులతో రూరల్ సిఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. యువత వాటి బారిన పడి చెడు అలవాట్లకు లోనవుతున్నారని తెలిపారు. ఈ హాస్టల్‌లో ఇలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్త వహించాలని సిఐ వారికి సూచించారు. ఈ హాస్టల్‌లో సిసి కెమరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి పదిగంటలు దాటితే హాస్టల్‌నుంచి బయటకు విద్యార్థులను పంపరాదన్నారు. అసాంఘీక శక్తులు ఎవరైనా ఉంటే మీ దృష్టికి వస్తే మాకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, గోల్డన్‌వ్యాలీ ఛైర్మెన్ ఎన్‌వి.రమణారెడ్డి, హాస్టల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పంటలకు జీవం ప్రకృతి వ్యవసాయ పద్దతులలో ద్రవ జీవామృతం సరైన మార్గం

చిన్నమండెం, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త :



చిన్నమండెం మండలం కొత్తపల్లె గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ పద్దతుల్లో పండించే రైతులను కాంప్లాట్ బ్లాకులుగా గుర్తించి వేరుశెనగ పంటలో ఏ గ్రేడ్ మోడల్ అవలంభించిన రైతులందరితో వారి వారి పొలాలను సందర్శించి రైతులకు వేరుశెనగలో యాజమాన్య పద్దతులు, రాజీలేని సూత్రాలపై మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యం ఆచారి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహికంగా ద్రవ జీవామృతం 2000 లీటర్స్ తయారు చేసి ఈ ద్రవ జీవామృతం 10 కిలోల దేశీ ఆవు పేడ, 10 లీటర్ల దేశీ ఆవు మూత్రం, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల ద్విదల పప్పు దినుసుల పిండి, గెప్పెడు పుట్టమన్ను, 200 లీటర్ల నీరు పట్టే ఒక ప్లాస్టిక్ డ్రమ్ము ముందుగా 200 లీటర్ల డ్రమ్ములో 180 లీటర్లు నీరు పోసి తర్వాత పైన చెప్పుకున్న పదార్థాలన్నీ నీటిలో కలుపుకొని సవ్య దిశలో ఒక కర్ర సహాయంతో ఒక నిమిషం పాటు ఉదయం సాయంత్రం కలుపుకొని దానిపై గోతపు సంచిని సవ్య దిశలో కర్ర సహాయంతో తర్వాత ద్రవ జీవామృతం పంటలకు వినియోగించుటకు తయారవుతుందన్నారు. తయారైన 15 రోజుల వరకు ద్రవ జీవామృతం పంటలపై తెగుళ్లు, రెక్కల పురుగు నివారణకు మొక్కలకు గ్రోత్ ప్రమోటారుగా కూడా అన్ని పంటలకు 1:10 అనగా ఒక లీటర్ తయారైన ద్రవ జీవామృతం, 10 లీటర్ల మీరు వడపోసుకొని అందులో కుంకుడుకాయ రసం లేదా షాంపూ 5 ఎంఎల్ కలుపుకొని పంటలపై వాడుకోవచ్చు. ఇదే జీవామృతంను నీటి సాయంతో మొక్క వేర్లకు కూడా పోషక నివారణకు, మొక్కల పెరుగుదలకు ఉపయోగించవచ్చు. ఇందులో ఎన్‌పికే సరైన మోతాదులో ఉండడం వల్ల పంటలు విస్తారంగా పండుతాయని, అతివృష్టి అనావృష్టికి తట్టుకొని పంట దిగుబడిని మొక్కలు ఇస్తాయన్నారు. రైతులందరూ పంటలకు పెట్టుబడులు తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు అవలంభిస్తే రైతుకు, పర్యావరణానికి మానవ ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, యూనిట్ ఇన్‌చార్జి రమణ, డిజిటల్ యూనిట్ ఇన్‌చార్జి వెంకట మల్లయ్య, ఐసిఆర్‌పిలు ఇంద్రావతి, కృష్ణమ్మ, రమాదేవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు నాగస్వాతి తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:




కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో అమ్మాయిల బాత్రూంలలో కెమెరాలు ఏర్పాటుచేశారన్న సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు సంఘటనకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. అమ్మాయిల హాస్టల్‌లలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, నంద కుమార్, పృధ్వీ, చందు, సోమశేఖర్ రాజు, లోకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నైతికతే నిజమైన స్వేచ్ఛ

దేశవ్యాప్త జాగృతి ఉద్యమం 2024 సెప్టెంబర్ 1 నుండి 30వరకు

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



జమాఅతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఖాదర్ హుస్సేన్ మస్జిద్ వీధిలోని మద్రసలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో పట్టణ అధ్యక్షురాలు హసినా మాట్లాడుతూ జమాఅతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల సెప్టెంబర్ 1 నుండి 30వ తేది వరకు నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో ఒక జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ప్రొద్దుటూరులో ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కడప జిల్లా అధ్యక్షురాలు రెహాన మాట్లాడుతూ నేడు స్వేచ్ఛ అంటే కళ్లెంలేని గుర్రంలా ఇష్టమొచ్చినట్లు జీవించడం, లేట్ నైట్ పబ్ కల్చర్ నచ్చినట్లు ఉండటం, ఇదే ఇప్పుడు స్వేచ్ఛగా మారిపోయింది. ఎలాంటి హద్దులు లేకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడమే స్వేచ్ఛగా భావిస్తున్నారని ఈ మితిమీరిన స్వేచ్ఛ ఎలాంటి అనర్థాలకు దారితీస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదని, నైతికత లేని స్వేచ్ఛ సమాజాన్ని ఎటు తీసుకెళుతుందో నిత్యం జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శణమని పేర్కొన్నారు. నైతికంగా దిగజార్చే స్వేచ్ఛ నిజమైన స్వేచ్ఛ కాదని నూతికతే నిజమైన స్వేచ్ఛ అని నైతికత విలువలను పెంపొందించుకునేందుకు తాము ఈ 30రోజుల పాటు డోర్ టూ డోర్ కార్యక్రమాలు, కరపత్రాల ద్వారా, కార్నర్ మీటింగ్స్ ద్వారా సోషల్‌మీడియాలో లఘు చిత్రాల ద్వారా మరియు కాలేజ్‌లలో విధ్యార్థి, విధ్యార్థులకు నైతిక విలువల ప్రాధాన్యతను వివరిస్తూ పలు జాగృతి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉద్యమ కన్వీనర్ ఆయిషా, మహబూబ్ చాన్, గులాబ్ జాన్, ఆయిషా కౌసర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యమ పోస్టర్లును ఆవిష్కరించారు.

## తైక్వాండో క్రీడాకారులకు ప్రయాణపు చార్జీలు అందించిన ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



సెప్టెంబర్ నెల 8వ తేది నుండి 11వ తేది వరకు ఆగ్రాలో జరిగే జూనియర్, సబ్ జూనియర్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా నుండి ఏడు మంది క్రీడాకారులు ఎంపిక కాగా, వారికి ఉపాధ్యాయ సంఘాల గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తన వంతుగా క్రీడాకారులకు 2000రూపాయల నగదు ప్రోత్సాహాన్ని వారి ప్రయాణ ఖర్చుల కోసం ప్రొద్దుటూరులోని తన కార్యాలయంలో వారికి అందించారు. బహుమతిని అందుకున్న క్రీడాకారులు ఫాతిమా, కళ్యాన్, సాయి కృష్ణతేజ, భరత్, ఖాసీమ్, మౌనిక, నదీష్ మొదలగువారు కార్యక్రమంలో వ్యాయామా ఉపాధ్యాయులు మాధవరెడ్డి, మధుసూధన్, గంగాధర్, అసోసియేషన్ కార్యదర్శి నాయబ్‌రసూల్, సలీం మరియు సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## డీకేటి పట్టాను తప్పుడు రిజిష్టర్ చేసిన సబ్ రిజిస్ట్రార్

న్యాయం చేయాలని బాధితుడు జయరాజు అధికారులకు విజ్ఞప్తి

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్‌గా 2021వ సంవత్సరంలో విధులు నిర్వహించిన విద్యాసాగర్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన డీకేటి పట్టాను రిజిష్టర్ చేసి తమ కుటుంబాన్ని రోడ్డు పాలు చేశారని రాజుపాళెం మండలం తొండలదిన్నె గ్రామానికి చెందిన సింహం జయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2007-08 సంవత్సరంలో తన తల్లి సింహం సునీతకు గృహాన్ని మంజూరు చేసిందని తెలిపారు. అయితే తమకు కేటాయించిన ప్లాటులో ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్‌గా విద్యాసాగర్ రెడ్డి విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్రామ చివరలో ఉన్న పొలం సర్వే నెంబర్ 102/1బి వేసి పట్టాను మాలె భాస్కర్ విక్రయించినట్లు ఆయన కుమార్తె మాలె చిన్న రంగమ్మ పేరుతో రిజిష్టర్ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు సర్వే నంబర్‌తో డికెటి పట్టణం రిజిస్టర్ చేసిన సబ్ రిజిస్ట్రార్ విద్యాసాగర్ రెడ్డిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎంతోమంది అధికారుల వద్దకు తిరిగానని అయితే ఎవరూ తనకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో సమాచార చట్టం కింద వివరాలని సేకరించి తీసుకొచ్చేందుకు ఇన్ని సంవత్సరాలు పట్టిందన్నారు. తక్షణమే అధికారులు తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దుచేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

యర్రగుంట్ల, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



నగరంలో శ్రీరాములపేట మండల ప్రాథమిక పాఠశాల నందు యర్రగుంట్ల విలేకరుల సంఘం, మల్లు ఫౌండేషన్, మన ఊరు కోసం టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించడమే కాకుండా నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆదివారం గుండెకు సంబంధించిన హోలిస్టిక్ హాస్పిటల్ కడప బ్రాంచ్ గుండెకు సంబంధించిన డాక్టర్ నవీద్ ఆహ్మద్, ప్రొద్దుటూరు హోలిస్టిక్ హాస్పిటల్ బ్రాంచ్ నుండి డాక్టర్ త్రిశూల్ రెడ్డి, జనరల్ సర్జన్, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ భావన, లతా పాలి నర్సింగ్ హోమ్ కంటి పరీక్షల అసిస్టెంట్ సురేష్ ఆధ్వర్యంలో 240 మందికి శిబిరంలో పరీక్షలు నిర్వహించగా 104మందికి జనరల్ సర్జన్ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు పరీక్షలు నిర్వహించి సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. గుండెకు సంబంధించి 70మందికి ఉచితంగా ఈసీజి, 2డిఏకో పరీక్షలు నిర్వహించారు. 70మందిని పరిశీలించిన వారికి ప్రభువైన సూచన సలహాలు ఇస్తు 20మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని, ఆసుపత్రి నందు ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్ జరుగుతుందని వారికి తెలుపుతూ 12మందికి పైగా కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు.

## రాజంపేటలో ఘనంగా చంద్రబాబు 30ఏళ్ల రాజకీయ ప్రస్థాన వేడుకలు

రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 30ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సంధర్భంగా ఆదివారం రాజంపేటలో నియోజకవర్గ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను పార్టీ నాయకులతో కలిసి బాలసుబ్రమణ్యం కట్ చేశారు. పరస్పరం స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు డాక్టర్ సుధాకర్, గన్నె సెబ్బనర్సయ్య నాయుడు, గీతాంజలి, రమణ, టి.లక్ష్మి నారాయణ, సంజీవరావు, నాగ సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మేక నరసింహులు, బాసినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు ప్రత్యేక పూజలు

తొండూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ః

తొండూరు నడి ఊరిలో వెలసిన ఆంజనేయస్వామికి శ్రావణమాసం చివరిరోజు సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి 100ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. పలువరు భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

## సామాజిక పింఛన్లు సరే.. మిగతా హామీల మాటేమిటి?

వేంపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ః

సామాజిక పింఛన్ల పంపిణీ సరే.. మేనిఫెస్టోలో పేర్కొన్న మిగతా హామీల మాటేమిటి? అని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టిలకు 50ఏళ్లకు పెన్షన్ ఇస్తామని చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 3 నెలలు అయినప్పటికీ అమలు కాలేదన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, ఇప్పటికీ అమలు కాలేదన్నారు. అలాగే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహాశక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, తదితర పథకాలు అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీసుల ముమ్మర దాడులు

- గత నెల రోజుల్లో 2096 మందిపై కేసు నమోదు
- అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం
- గత నెల రోజుల్లో పోలీసు శాఖ పనితీరుపై గణాంకాలు విడుదల చేసిన ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:




జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై దాడులు, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యంపై దాడులు నిర్వ హించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత నెల రోజుల్లో జిల్లా పోలలీసు శాఖ పనితీరుపై ఆదివారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు గణాంకాలను విడుదల చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం చేసిన 2096 మందిపై కేసు నమోదు చేయడం జరిగిందని 30 పాఠశాల ఆవరణాల్లో పిచ్చిమొక్కలను పొదలను తొలగించి విద్యార్థులకు ఆహ్లాదకరంగా ఉండేలా పరిసరాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గంజాయి విక్రయ దారుల నుంచి 12 కేజీలు స్వాధీనం చేసుకొని 12 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేశామన్నారు. గ్యాంబ్లింగ్, మట్కా ఇసుక అక్రమ రవాణాపై ముమ్మరంగా దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీసు శాఖకు ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా సహకరించాలని డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

## ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి సేవలు అభినందనీయం

పులివెందుల, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ః

ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి వెంకటరామిరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు. విద్యాశాఖలో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అంకిత భావంతో విధులు నిర్వహించారని వెంకటరామిరెడ్డి సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. వేముల మండలంలోని మల్లాపురం(బచ్చయ్యగారిపల్లె)లోని శ్రీకృష్ణ కమిటి ఎయిడెడ్ పాఠశాలలో 1998లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి 2011 వరకు ఇద్దరు ఉపాధ్యాయులుగా పనిచేశారు. తరువాత నుండి ఇప్పటి వరకు ఏకోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామంలోను, మండలంలోను మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నారు. బాధ్యతలు చేపట్టిన మల్లాపురం గ్రామంలోనే 26ఏళ్లు ఒకేచోట పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. రెండు దశాబ్దాలు ఒకేచోట పనిచేయడంతో గ్రామస్థులతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. రిటైర్ అవుతున్న వెంకటరామిరెడ్డికి గ్రామస్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈయన చేసిన సేవల గురించి గ్రామస్థులు, ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్ చలపతి కొనియాడారు. వెంకటరామిరెడ్డిని, ఆయన సతీమణి ఎం.సులోచనమ్మ దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డికుమారుడు మణికంఠారెడ్డి,రమ్య ప్రియాంకరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆస్థి విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ ఒకరికి గాయాలు

వీరబల్లి,సెప్టంబర్01,ప్రభాతవవార్త :

మండలంలోని తాటిగుంటపల్లె పంచాయితీ ఉప్పరపల్లెలో ఆస్థి విషయమై జరిగిన ఘర్షణలో ఒకరికి రక్త గాయాలయ్యాయి. వివరాల్లోకెలితే మండలంలోని తాటిగుంటపల్లె పంచాయితీ ఉప్పరపల్లెలో వెంకట్రామరాజుకు నలుగురు కొడుకులు కలరు. ఆయనకు 20 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. పెద్దకుమారుడైన జయరామరాజు తన తల్లిని చూసుకుంటూ ఉండడంతో రోడ్డు ప్రక్కన గల 3.5 ఎకరాల స్థలం ఆయన అనుభవంలో ఉండేది. ఇది జీర్ణించుకోలేని మిగిలిన ముగ్గురు సోదరులు తరచూ ఆ భూ విషయం పై ఘర్షన పడుతుండేవారు కాగా అదే క్రమంమలో ఆదివారం మిగిలిన ముగ్గురు తమ్ముళ్లు అన్న దగ్గరకు వెళ్లి మొత్తం 20 ఎకరాలను పంచాల్సిందిగా కోరారు. అందుకు జయరామరాజు సెసేమీరా అనడంతో ఘర్షణ పడ్డారు. ఘర్షణలో భాగంగా పెద్దవాడైన జయరామ రాజు చేతికందిన కర్రతో చిన్నవాడైన రామక్రిష్ణమ రాజు ను తలపై కొట్టాడు. దాంతో అతనికి రక్త గాయవమైంది, హుటాహుటిన గాయపడిన రామక్రిష్ణమరాజును ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఫేక్ కాల్ పై పోలీసులకు ఫిర్యాదు

పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త :

కాశినాయన మండలం రెడ్డి కొట్టాల గ్రామానికి చెందిన రామసుబ్బయ్య పేదలను ఇబ్బందులను గురిచేస్తున్న నేపథ్యంలో తాను దళితులకు అండగా ఉండడంతో టీడీపీ నేత సుధాకర్ రెడ్డికి సీఎం కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఫేక్ కాల్ వచ్చింది. దీనిని గుర్తించిన సుధాకర్‌రెడ్డి ఇది రామసుబ్బయ్య కుమారుడు రామకృష్ణ పనేనని తెలుసుకుని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పట్టణంలో వరుస చోరీలు

మొన్న పట్టపగలు చోరీ : నేడు మొబైల్ షాపులో లక్ష రూపాయల విలువైన సెల్‌ఫోన్లు చోరీ

బద్వేలు, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త :



పట్టణంలో రెండురోజులుగా వరుస చోరీలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం శ్రీ కృష్ణదేవరాయనగర్‌లో ఒక బాలుడు ఇంట్లోకి వెళ్లి దర్జాగా చోరీ చేసి వెళ్లిపోయాడు. దాదాపు రూ.1,50లక్షలు విలువైన బంగారు అపహరణకు గురైంది. శనివారం రాత్రి కూడా పట్టణంలోని సిద్దవటం రోడ్డు సీఎస్ఐ చర్చిలో ఉన్న మొబైల్‌షాపులో చోరీ జరిగింది. దాదాపు లక్ష రూపాయలు విలువైన మొబైల్స్ తీసుకెళ్లినట్లు సమాచారం. రోజులాగే యజమాని షాపు మూసేసి శనివారం రాత్రి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం షాపు తెరవకపోవడంతో సాయంత్రం వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రాజగోపాల్, ఎస్ఐ రవికుమార్‌లు చోరీకి గురైన మొబైల్ షాపును పరిశీలించారు. షాపు వెనుక బాగంలో ఉన్న కిటికీ ఉచ్చులు తొలగించి షాపులోకి ప్రవేశించి చోరీ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. శనివారం అర్థరాత్రి సమయంలో జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వరుస చోరీలపై పోలీసులు అ ప్రమత్తయ్యారు.

## వర్షం వస్తే వీధులు చెరువులాయే.....

పెనగలూరు,సెప్టంబర్01,ప్రభాతవవార్త :



పెనగలూరులోని అరుందతి వాడ నుండి దూదేకుల వీధి మీదుగా బస్టాండుకి వచ్చే దారి వర్షాకాలం వచ్చిందంటే చెరువును తలపిస్తుంది. పైభాగాన రోడ్డు నిర్మాణం అప్పుడు ఎత్తు లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాని కాలం సమయాన వృద్దులు, బడి పిల్లలు, ఈ మార్గాన వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంటుంది. పై అధికారులు దీనిపై స్పందించి రోడ్డు పైన కిందికి నీరు జారేలాగా స్లోప్ వేపిస్తే బాగుంటుందని స్థానిక జనసేన నాయకులు అబ్దుల్ మోషిద్, పరుశురాం, ప్రభాత వార్తకు తెలిపారు.

## కుందూ నదిలో పెరుగుతున్న నీటి ప్రవాహం

దువ్వూరు, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త:



కర్నూలు, నంద్యాల, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కుందూ నదిలో నీటి ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం కుందూనదిలో రాజోలి వద్ద 17వేల క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తుందని కేసీకెనాల్ ఏఈ జమాల్ వల్లి పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రాజోలి నుండి మైదుకూరు, చాపాడు కాలువలలో నీటి మట్టాన్ని కూడ తగ్గించినట్లు తెలిపారు. ఎక్కువగా నీరు కాలువల్లో నీరు ప్రవహించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. కుందునదిలో శనివారం 15వేల క్యూసెక్కులు ఉండగా ఆదివారానికి 17వేల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో ఒకరోజు 2వేల క్యూసెక్కుల నీటి మట్టం పెరిగినట్లు తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత కేసీ కాలువలకు యదావిధిగా నీరు వదులుతామన్నారు. ఏదిఏమైనా మైదుకూరు నియోజకవర్గ ప్రాంతంలో కసీ కెనాల్‌కు నీరు రావడం అలాగే రెండు రోజులుగా వర్షాలు రావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా వరి నాట్లు ముమ్మరంగా సాగయ్యే అవకాశం ఉంది.

